RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:20 9-7-2025 బుధవారం ఎడిటర్ :ముర్రి పవీన్ పేజీలు : 8 వెల 4 /-

## ఆంధ్రప్రదేశ్‌కి కేంద్ర ప్రభుత్వం మరో గుడ్ న్యూస్




ఢిల్లీ:,జూలై 8(టుడే విదుర): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం మరో తీపి కబురు చెప్పింది. విజయనగరం జిల్లా గరివిడిలోని వెటర్నరీ కాలేజ్‌పై కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆ కాలేజ్‌కి శాశ్వత సభ్యత్వం కొనసాగించేందుకు మోదీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ కాలేజ్‌లో చివరి సంవత్సరం చదివే విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సదుపాయం కూడా కల్పించాలని ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. విద్యార్థులను మరో కాలేజ్‌కి తరలించి వెసులుబాటు కల్పించేందుకు కేంద్రమంత్రి లలన్ సింగ్ అంగీకరించారు. గత జగన్ ప్రభుత్వ నిర్వాకంతో గరివిడి కాలేజ్‌కి అనుమతులని కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గరివిడిలోని వెటర్నరీ కాలేజ్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ కాలేజ్‌పై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈరోజు ఢిల్లీలో కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి లలన్ సింగ్‌తో ఇరువురు నేతలు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. గరివిడి కాలేజీకి ఉన్న ప్రాధాన్యతను కేంద్రమంత్రికి వివరించారు. 2018లో గరివిడి వెటర్నరీ కాలేజ్‌ని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఈ కాలేజ్ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

## కృష్ణమ్మకు చంద్రబాబు జలహారతి- శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి దిగువకు నీళ్లు విడుదల



,జూలై 8(టుడే విదుర)::శ్రీశైలం ఎగువ నుంచి వస్తున్న నీటితో శ్రీశైలం ప్రాజెక్ట్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది.. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు కృష్ణమ్మకు జల హారతులు ఇచ్చి, రైతుల హర్షద్వానాల మధ్య కృష్ణమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం శ్రీశైలం ప్రాజెక్టు 6, 7, 8, 11 నెంబర్ల రేడియల్ గేట్లను తెరచి నీటిని దిగువకు వదిలారు. పరవళ్ళు తొక్కుతూ దిగువకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ నదిని చూసి ముఖ్యమంత్రి పులకరించి పోయారు.ముందుగా ఆయన శ్రీశైలంలో జలాశయంలో జల హారతి కార్యక్రమంలో శ్రీశైలంకు చేరుకున్నారు. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రులు ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. అనంతరం ద్వాదశాలలో రెండవ జ్యోతిర్లింగం, ఆరవ అష్టాదశ శక్తిపీఠం,ఇలలో వెలసిన కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనం చేసుకున్నారు.. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ముఖ్యమంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేదమంత్రాలతో స్వామివారి దర్శనార్థం ఆలయంలోకి తీసుకువెళ్లిన అర్చకులు.

## మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు.. పవన్, లోకేష్ స్ట్రాంగ్ వార్నింగ్



అమరావతి:,జూలై 8(టుడే విదుర): కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే తాటతీస్తామని వార్నింగ్ ఇచ్చారు. (మంగళవారం) ఏపీ సచివాలయంలో మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడారు. మహిళల వ్యక్తిత్వాన్ని అవహేళన చేస్తూ కించపరిచే వ్యాఖ్యలు చేయడం వైసీపీ నేతలకి ఒక అలవాటుగా మారిపోయిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు పవన్ కల్యాణ్.ప్రసన్న మాటలకి సభ్యసమాజం సిగ్గుపడుతోందని పవన్ కల్యాణ్ అన్నారు. వ్యక్తిగత జీవితాలని లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేయడం, మహిళలని కించపరచడాన్ని ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలని చెప్పారు. ప్రసన్న వ్యాఖ్యలు అందరికీ బాధ కలిగించాయని అన్నారు. మహిళల గౌరవానికి భంగం కలిగించినా, అసభ్య వ్యాఖ్యలు చేసినా చట్టప్రకారం కఠినంగా చర్యలు ఉంటాయని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పుడూ వైసీపీ నేతలు నోటి దురుసుతో అసభ్యంగా వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. నిండు శాసనసభలో కూడా అదేవిధంగా మాట్లాడటంతో వైసీపీ నేతలకి ప్రజలు సరైన రీతిలో తీర్పు చెప్పారని గుర్తుచేశారు. అయినప్పటికీ నోటి దురుసు ఇంకా వదల్లేకపోతున్నారని ధ్వజమెత్తారు. మన సమాజం మరోసారి ఆ పార్టీకి తగిన విధంగా సమాధానం చెబుతుందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

## మామిడి రైతులు నష్టపోతున్నారు.. కేంద్రం అదనపు సాయం చేయాలి: మంత్రి అచ్చెన్నాయుడు




అమరావతి:,జూలై 8(టుడే విదుర): కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్?ను (మంగళవారం) మర్యాదపూర్వకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కలిశారు. రాష్ట్రంలో రైతుల సమస్యలపై కేంద్రమంత్రితో చర్చించారు. గుంటూరులో చిల్లీ బోర్డ్, శ్రీకాకుళంలో జీడిపప్పు బోర్డ్, చిత్తూరులో మామిడి బోర్డ్‌ని ఏర్పాటు చేయాలని కోరారు. విభజన చట్టం ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని సూచించారు.మంత్రి అచ్చెన్నాయుడు వినతులపై సానుకూలంగా కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్? స్పందించారు. రాష్ట్రంలో వ్యవసాయరంగా సమగ్రా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని కేంద్రమంత్రిని కోరారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు. తొతాపురి మామిడి ధర తగ్గడంతో రైతులకు నష్టం వాటిల్లుతోందని చెప్పారు. ధర రూ.8కి పడిపోవడంతో ఏపీ ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

## జగన్ భయంకర కుట్రలకు తెరలేపుతున్నాడు: మంత్రి పయ్యావుల




అమరావతి, జూలై 8(టుడే విదుర)::వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి భయంకర కుట్రలకు తెరలేపుతున్నారని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీయాలని జగన్ కుట్ర చేస్తున్నారని పయ్యావుల ఆరోపించారు. ఓటమి తర్వాత కూడా జగన్ వైఖరిలో మార్పు లేదన్న పయ్యావుల.. ఓట్లు వేయలేదని ప్రజలపై అక్కసు వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏపీలో సమర్థవంతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఏపీకి పెట్టుబడులు వస్తుంటే వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి తట్టుకోలేకపోతున్నారని పయ్యావుల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో పెట్టుబడులు పెట్టొద్దని పారిశ్రామికవేత్తలకు.. ఉదయ్‌భాస్కర్ అనే వ్యక్తితో 200 మెయిల్స్ పెట్టించారని మంత్రి పయ్యావుల చెప్పారు. ఆ తర్వాత లేళ్ల అప్పిరెడ్డిని తెరపైకి తీసుకొచ్చారని.. జగన్ ఎన్ని కుట్రలు పన్నినా ఏపీ బ్రాండ్ ఎక్కడా తగ్గలేదని పయ్యావుల అన్నారు. మేం పక్కా ఆధారాలతో మాట్లాడుతున్నామన్న మంత్రి పయ్యావుల.. 'గత వైసీపీ హయాంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారు.. జగన్ నీ ఏడుపు ఇంకెంతకాలం?' అని మంత్రి పయ్యావుల కేశవ్.. ఘాటుగా కౌంటరిచ్చారు.

## ప్రసన్న కుమార్ రెడ్డిపై ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పోలీసులకు ఫిర్యాదు



నెల్లూరు: జూలై 8(టుడే విదుర):కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రసన్న కుమార్ రెడ్డిపై ప్రశాంతి రెడ్డి నెల్లూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఇవాళ(మంగళవారం) ఫిర్యాదు చేశారు. ప్రసన్నకుమార్ రెడ్డి తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఈ ఫిర్యాదులో ప్రశాంతిరెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రసన్న కుమార్ రెడ్డి తనపై వ్యక్తిగతంగా అసభ్యకర పదజాలంతో ధూషణలు చేశారని ఫైర్ అయ్యారు. తాను ఏఎస్పీకి ప్రసన్న కుమార్ రెడ్డిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానని.. పోలీసులు చట్టపరంగా ఆయనపై చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని కోరారు ప్రశాంతి రెడ్డి.జగన్ పార్టీ నీచసంస్కృతికి తెరదీసిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మండిపడ్డారు. తనపై ప్రసన్న కుమార్ రెడ్డి దుర్మార్గమైన వ్యాఖ్యలు చేశారని ఫైర్ అయ్యారు. మహిళలందరినీ వైసీపీ నేతలు దారుణంగా కించపరుస్తున్నారని ధ్వజమెత్తారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక వైసీపీ నేతలు తప్పుడు మార్గాన్ని ఎన్నుకున్నారని విమర్శించారు.

# సంపాదకీయం

## సీమ జలసమృద్ధికి బనకచర్ల భరోసా

పోలవరం%-%బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయలసీమ జిల్లాలలో తాగునీటి అవసరాలకు, ముందు ముందు రాబోయే ఇంజనీరింగ్, రక్షణ రంగ పరిశ్రమల అవసరాలకు గోదావరి నీటిని ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. పది సంవత్సరాలలో మూడేళ్ళు మాత్రం కృష్ణాజలాలు పారటానికి అవకాశమున్న హంద్రీ%-%నీవా, గాలేరు నగరి, తెలుగు గంగ, ప్రకాశం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టులకు ప్రత్యామ్నాయ ఏర్పాటు ఉండాలి. కనుక గోదావరి జలాల మళ్ళింపు ఉత్తమ మార్గం.పోలవరం-బనకచర్ల పథకంపై గత కొద్ది రోజులుగా రాజకీయ ధర్మోపన్యాసాలు పుంఖానుపుంఖాలుగా వెలువడుతున్నాయి. చట్టబద్ధత లేని, స్వయంప్రకటిత కేటాయింపుగా 1450 టీఎంసీల గోదావరి జలాలలో తమ వాటా 1000 టీఎంసీలని తెలంగాణ చెప్పుకుంటూనే, వరద జలాలతో 80 నుంచి 90 రోజులలో పంపింగ్ జరిగే ఆంధ్రప్రదేశ్ బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు నష్టం కలుగుతుందని చాటించుకుంటున్నారు. 2016లో జరిగిన గోదావరి జల యాజమాన్య బోర్డు మీటింగులో తెలంగాణ ప్రతినిధులు గోదావరి జలాలు ఇరు రాష్ట్రాల మధ్య కేటాయింపులు జరగలేదనీ, రాష్ట్రాల మధ్య పరస్పర ఒడంబడిక ద్వారా గానీ, ట్రైబ్యునల్ నిర్ణయం ద్వారా గానీ కేటాయింపులు జరగాలని చెప్పారు. అయితే ఈ రెండూ జరగలేదు. కానీ తమ వాటా 1000 టీఎంసీలనీ, (ఇంతకు ముందు ప్రభుత్వం 945 టీఎంసీలుగా చెప్పింది) ఆంధ్రప్రదేశ్ వరద జలాలు కూడా ముట్టుకోవడానికి వీలులేదనీ దబాయిస్తున్నారు. ఇటువంటి దబాయింపులు గత పదకొండేళ్ళుగా వింటూనే ఉన్నాం. గోదావరి ట్రైబ్యునల్ తీర్పు ప్రకారం ఏ రాష్ట్రమయినా వారి వాటా జలాలను ఇంకొక బేసిన్‌కి తరలించుకోవచ్చు. చట్టబద్ధమయిన కేటాయింపులు లేని నికర జలాల ఆధారంగా తెలంగాణ అనేక ప్రాజెక్టులు చేపట్టవచ్చు కానీ, ఆంధ్రప్రదేశ్ మాత్రం వరద జలాలతో కూడా ప్రాజెక్టులు నిర్మించకూడదు. కొందరు తెలంగాణ నాయకులయితే మళ్లించిన గోదావరి జలాలకు సమానంగా వారికి కృష్ణా జలాలు సమర్పించుకోవాలని హుకుం జారీ చేస్తున్నారు.తెలంగాణతో బనకచర్ల ప్రాజెక్టు వివాదాల్ని పక్కన పెట్టి, ఆ ప్రాజెక్టు ఆవశ్యకత గురించి పరిశీలిద్దాం. రాయలసీమ ప్రాజెక్టులయిన హంద్రీ%-%నీవా, గాలేరు నగరి, తెలుగు గంగ, ప్రకాశం జిల్లాలోని వెలిగొండలకు గోదావరి నీటి సరఫరాకు ఉద్దేశించిన పథకం పోలవరం%-%బనకచర్ల. ఈ ప్రాజెక్టులు బచావత్ ట్రైబ్యునల్ కల్పించిన మిగులు జలాల వినియోగానికి ఉద్దేశించినవి. కానీ బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్%-%2 తీర్పు తరువాత ఈ వెసులుబాటుకు ఆటంకం కలిగింది. ఈ తీర్పు ఇంతవరకు అమలులోకి రానందున పాత పద్ధతే కొనసాగుతోంది. బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్%-%1 తీర్పులో ఒక రాష్ట్రం తమ వాటాని రాష్ట్రంలో ఎక్కడయినా వాడుకోవటానికి వీలు కల్పించింది.

విభజన చట్టం%-%2014లో షెడ్యూల్ పదకొండు, ఈ ప్రాజెక్టులకు ప్రస్తుతం ఉన్న నీటి వినియోగం కొనసాగుతుందని చెప్పింది. ఇప్పుడు నడుస్తున్న ట్రైబ్యునల్%-%2 ఎక్స్‌టెన్షన్ ఇరు రాష్ట్రాల మధ్య వారి వారి ప్రాజెక్టులకి నిర్దిష్ట కేటాయింపు లేకపోతే, ఆ పరిమాణాలని కూడా నిర్ణయించి, ఆపరేషన్ ప్రొటోకాల్ నిశ్చయించాల్సి ఉంది. 2013లో ఇదే ట్రైబ్యునల్%-%2 ఈ ప్రాజెక్టులకి కేటాయింపులు చేయకపోగా, సగటు నీటి లభ్యత వరకు (2578 టీఎంసీలు) అన్ని రాష్ట్రాలకి కేటాయింపులు చేసేసింది. కనుక ప్రస్తుత ట్రైబ్యునల్%-%2 ఎక్స్‌టెన్షన్ ఒకవేళ చేస్తే ఈ 2578 టీఎంసీలకు అధికంగా లభ్యమయ్యే నీటిని వాడుకోవచ్చు అని అనవచ్చేమో? లేదా అసలు వీలు కాదని చెప్పినా చెప్పవచ్చు. ఈ 2578 టీఎంసీల కంటే అధికంగా లభ్యమయ్యే నీటికి తెలంగాణ కూడా పోటీదారు(విభజన చట్టం షెడ్యూల్ 11లో కల్వకుర్తి, నెట్టెంపాడు కూడా ఉన్నాయి). అంతేకాదు ప్రస్తుతం ఈ ప్రాజెక్టుల హెడ్ వర్క్స్ అన్నీ ఆయా రాష్ట్రాల నిర్వహణలో ఉన్నాయి. ముందు ముందు ఇవి కృష్ణా యాజమాన్య బోర్డు ఆధీనంలోకి వెడతాయి. అప్పుడు, ఇప్పుడున్న వెసులుబాటు కూడా ఉండదు. పైగా మిగులు నీటిని (2578 టీఎంసీల కంటే ఎక్కువగా లభ్యమయ్యే) ఆరు ప్రాజెక్టులకి పంచాలి. ఒకవేళ ట్రైబ్యునల్ ప్రాధాన్యక్రమం నిర్ణయించకపోతే, అనుక్షణం జగడం జరుగుతుంది. వరద ఎంత కాలం లభ్యమవుతుందో కూడా ఒక సందిగ్ధమే కనుక, రాయలసీమ ప్రాజెక్టులయిన హంద్రి%-%నీవా, గాలేరు%-%నగరిలకు నీటి సరఫరా ఒక అనిశ్చితిగా ఉంటుంది. తెలుగు గంగ ప్రాజెక్టుకు ట్రైబ్యునల్%-%2 సరాసరి నీటి లభ్యత ఆధారంగా 25 టీఎంసీలు కేటాయించినా (ప్రాజెక్టు రూపకల్పన 29 టీఎంసీలకి జరిగింది), ఈ కాలువ ద్వారా చిత్తూరు జిల్లాలో అదనపు ఆయకట్టుకు, ముఖ్యంగా రాయలసీమ జిల్లాలలో తాగునీటి అవసరాలకు, ముందు ముందు రాబోయే ఇంజనీరింగ్, రక్షణ రంగ పరిశ్రమల అవసరాలకు గోదావరి నీటిని ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. పది సంవత్సరాలలో మూడేళ్ళు మాత్రం కృష్ణాజలాలు పారటానికి అవకాశమున్న ఈ ప్రాజెక్టులకు ప్రత్యామ్నాయ ఏర్పాటు ఉండాలి. కనుక గోదావరి జలాల మళ్ళింపు ఉత్తమ మార్గం. ఒకవేళ మళ్ళించకపోతే నష్టపోయేది రాయలసీమే, అదీగాక, ప్రస్తుతం రాష్ట్రం మొత్తం వాటాలో కొంత నీటిని ఎక్కడయినా వాడుకునే వెసులుబాటు కూడా రద్దవుతుంది. ఎందుకంటే ట్రైబ్యునల్ ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు నిర్ణయించినప్పుడు, వేరే చోట ఆ నీటిని వాడలేరు, అప్పుడు బోర్డు చేతులు కూడా కట్టివేసినట్టు అవుతుంది. సోమశిల, కండలేరు రిజర్వాయర్లను గత కొద్ది సంవత్సరాలుగా కృష్ణా జలాలతో గండికోట ప్రాజెక్టు ద్వారా అదనంగా నింపుతున్నారు. గోదావరి జలాల మళ్ళింపు తర్వాత కూడా ఆ జలాలతోనే వాటిని బనకచర్ల%-%గండికోట ద్వారానే నింపటం ఉత్తమం. పోలవరం%-%బనకచర్ల ప్రాజెక్టుని తెలంగాణ వారి కాళేశ్వరం ప్రాజెక్టుతో పోల్చి అవినీతి జరగవచ్చని సంకోచం వెలిబుచ్చుతున్నారు. అవినీతి అంశం వదిలేస్తే%-% పెట్టుబడి పరిమాణం, చేపట్టవలసిన నిర్మాణ స్థూలత్వం గమనిస్తే, బహుశ ఆ పోలిక సమర్థనీయం కావచ్చు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మితమైన టన్నెళ్ళు, భూగర్భ పంపుహౌస్‌లు, కాలువలు, చెరువులు గణనీయంగా ప్రశంసించదగినవే. బారేజ్‌లలో తప్పిదాలు జరిగాయి కాని, సమగ్రంగా అది ఒక మెగా ప్రాజెక్టు. బారేజ్‌లు దెబ్బతిన్న పరిస్థితిలో ఉన్నా, తక్కువ రోజుల పంపింగ్‌తో వరదల సమయంలో పాక్షిక లాభాలు పొందవచ్చు. దశాబ్దాల క్రితంలా కాకుండా ఇప్పుడు ప్రాజెక్టులన్నీ మెగా పరిమాణంలోనే ఉంటున్నాయి. జాతీయ రహదారుల విస్తరణ, కొత్త బాటల నిర్మాణాలు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం వంటివి తలచుకుంటే సాధించగలమని చెబుతున్నాయి. సరైన సంకల్పంతో పోలవరం%-%బనకచర్ల ప్రాజెక్టు కూడా నిర్ణీత సమయంలో అలా నిర్మించవచ్చు.

# నా భార్యను తుర్కియే నుంచి కాపాడండి



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 8(టుడే విదుర): బతుకు తెరువు కోసం తుర్కియే(టర్కీ) వెళ్లిన తన భార్య, చిత్రహింసలు అనుభవిస్తోందని, ఆమె ను కాపాడాలని పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు అగ్రహారానికి చెందిన మద్దా దానియేలు తాడేపల్లిగూడేనికి చెందిన క్రైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావుకు విన్నవించారు. ఏడు నెలల క్రితం తన భార్య రహేలు ఖతార్ వెళ్లగా, అక్కడి ఏజెంట్ మోసం చేసి తుర్కియే పంపించారన్నారు. తుర్కియేలో యజమాని తన భార్యకు అన్నం కూడా పెట్టకుండా గొడ్డుచాకిరీ చేయించుకుంటున్నారని, అది తెలిసి తన పిల్లలిద్దరూ బెంగ పెట్టుకున్నారని వాపోయాడు. రహేలు తండ్రి ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని, తన భార్యను రక్షించాలని కోరారు. ఎంబసీతో సంప్రదించి వీలైనంత త్వరగా రప్పిస్తానని మాణిక్యాలరావు హామీ ఇచ్చారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

విజయవాడ(బస్సుస్టేషన్)జూలై 8(టుడే విదుర): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణకు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ చైర్మన్‌ను ఆయన చాంబర్‌లో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి 24 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) ద్వారా వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని, పాత పద్ధతిలో రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్య సౌకర్యాలు అందించాలని కోరారు.




# ఫైర్‌కు పైత్యం



**కేంద్ర, రాష్ట్రాలు నిధులిచ్చినా ఖర్చు చేయని వైనం**
**ఫైరింజన్లు పాతబడినా కొత్తవి కొనని చాదస్తం**
**అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనిలా.. విపత్తుల శాఖ దైన్యం**
**మొదటి విడత నిధుల్లో పైసా ఖర్చుచేయని పరిస్థితి**
**రెండో విడత నిధులకు పొరుగు రాష్ట్రాల ప్రతిపాదనలు**
**అగ్నిమాపక శాఖలో అంతులేని అలసత్వం**

జూలై 8(టుడే విదుర):అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సైరన్ మోగిస్తూ వేగంగా వచ్చే ఫైరింజన్లు వయసు మళ్లి కదల్లేకపోతున్నాయి. ఏ మూలకైనా రయ్‌మంటూ చేరుకునే అగ్నిమాపక శకటాలు మొరాయించి మూలకు చేరాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులిచ్చి ఫైరింజన్లు కొనుక్కోమని చెప్పినా అలసత్వంతో నిధులు మురగ బెట్టేస్తున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులది నిర్లక్ష్యమా? లేక చాదస్తమా? అనేది పక్కన బెడితే.. వరదలు సంభవిస్తే సహాయ చర్యలకు అక్కడికి చేరుకునేందుకు ఫైరింజన్లు కదలవు. కొనుగోలు చేయాల్సిన బోట్లు కొనలేదు. ఆఖరికి సిబ్బందికి బూట్లు కూడా లేవు. అన్నింటా ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామని పదే పదే చెబుతోన్న కూటమి ప్రభుత్వంలో పది నెలల క్రితం నిధులు మంజూరైనా ఖర్చు చేయకుండా నాన్చుతున్న అగ్నిమాపక శాఖ అధికారుల పనితీరుతో అది ఎలా సాధ్యమనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని.. అనే సామెతను వీరి అలసత్వం గుర్తు చేస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 230 ఫైరింజన్లు ఉండగా, వాటిలో 60శాతానికిపైగా పదిహేనేళ్లు పైబడినవే. దీంతో వాటికి ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇచ్చేది లేదని రవాణా శాఖ అధికారులు ఆర్నెల్ల క్రితమే స్పష్టం చేశారు. వాటిలో 75 వాహనాలు గుజిరీకి వేయాల్సిందేనని తేల్చిచెప్పడంతో అగ్నిమాపక శాఖ ఆ పనిని పూర్తి చేసింది. అదే సమయంలో రూ.252 కోట్లతో అగ్నిమాపక శాఖ ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇందులో కేంద్రం వాటా రూ.189 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.63 కోట్లు భరించాల్సి ఉంది. ఇందుకు చంద్రబాబు ప్రభుత్వమూ సమ్మతి తెలిపింది. రాష్ట్రంలో 125 అత్యాధునిక ఫైరింజన్లు కొనుగోలు చేసుకుని, 17 చోట్ల ఫైర్ స్టేషన్లు నిర్మించుకోవాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగ్గా అగ్నిమాపక సేవలు అందించడానికి ఫైర్ ఫైటింగ్ అత్యాధునిక పరికరాలు సమకూర్చుకోవడం, దూళపల్లిలో శిక్షణకేంద్రాన్ని మెరుగుపరచుకోవడం కోసం చర్యలు తీసుకోవాలని సూచించింది. అందుకోసం మొదటి విడతగా కేంద్రం రూ.58 కోట్లు విడుదల చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.17కోట్లు గతేడాది ఆగస్టులోనే విడుదల చేసింది. ఆ మొత్తం రూ.75కోట్లతో 125 ఫైరింజన్లు, సముద్ర తీరం ఎక్కువగా ఉన్న రాష్ట్రం గనుక 60 బోట్లు, సిబ్బందికి బూట్లు, ప్రత్యేక రక్షణ సూట్లు కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు పదినెలలు పూర్తైనా కనీసం టెండర్లు పిలవకపోవడం వారి పనితీరుకు నిదర్శనం. అలాగే, దక్షిణ భారతంలోనే అత్యుత్తమ శిక్షణ కేంద్రాన్ని దూళపల్లిలోని పదిహేను ఎకరాల్లో నిర్మించి జాతీయ స్థాయిలో శిక్షణ ఇప్పిస్తామని ప్రభుత్వం చెప్పి ఏడాది గడుస్తున్నా పనులు కాగితాలు దాటలేదు.

# ధర్మరాజస్వామి ఉత్సవాల్లో ఘర్షణ



శ్రీకాళహస్తి, జూలై 8(టుడే విదుర):శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య దాడులు.. వీధి పోరాటాన్ని తలపించింది. సిబ్బంది ప్రాణరక్షణ కోసం గదిలోకి వెళ్లి దాక్కోవాల్సి వచ్చింది. రోగులు, వారి సంబంధీకులు ఏం జరుగుతుందో అర్థం కాక పరుగులు తీశారు. ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయం వద్ద రాత్రి అగ్నిగుండం తర్వాత జరిగిన కురుక్షేత్ర సంగ్రామం (యుద్ధపర్వం) ఘట్టం సందర్భంగా జరిగిన చిన్న వివాదమే.. ఈ దాడులకు కారణమైంది. ఆ ఉత్సవ సమయంలో ఆలయం వెనుక.. తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట పట్టణానికి చెందిన రోహిత్, ధనుష్ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నారు. అదే సమయంలో భాను, కిరణ్, చరణ్ ధర్మరాజస్వామి ఆలయం వైపు వెళుతుండగా వారితో వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. రోహిత్, ధనుష్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి కుటుంబసభ్యులైన మునిరత్నం, సుధాకర్, మునిరాజా గాయపడిన రోహిత్, ధనుషను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాసేపటికి భాను తన ఇద్దరు సోదరులతో పాటు మరికొంత మందిని వెంటబెట్టుకుని ఆస్పత్రికి వెళ్లారు. ఇరువర్గాలు కత్తులు, దుడ్డుకర్రలు, రాళ్లతో ఒకరిపై ఒకరు విరుచుకపడ్డారు. కొందరు ప్రాణభయంతో తప్పించుకునే క్రమంలో కాన్పుల రూంలోకి చొరబడ్డారు. అక్కడ బాలింతలు, గర్భిణులు, నవజాత శిశువులు ఉన్నారు. ఆస్పత్రిలో రోగులంతా వణికిపోయారు. అక్కడే సమీపంలోనే నర్సింగ్‌స్టేషన్‌లో ఉన్న స్టాఫ్‌నర్సులు ప్రాణభయంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు

# తిరుపతిలో సైకో వీరంగం

## కత్తి, కర్రతో ముగ్గురిపై దాడి, ఒకరి మృతి



తిరుపతి(నేరవిభాగం), జూలై 8(టుడే విదుర): ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతిలో ఉదయం 7.15 గంటలకు ఓ సైకో వీరంగం సృష్టించాడు. తమిళనాడుకు చెందిన మతి స్థిమితంలేని వ్యక్తి కొన్ని నెలలుగా తిరుపతిలో తిరుగుతూ వాహనాలపై రాళ్లు రువ్వడం, ఫుట్‌పాత్‌లపై ఉన్న యాచకులపై రాళ్లదాడి చేసేవాడు. ఈ క్రమంలో నంది సర్కిల్ వద్ద దాదాపు 10 మందిపై రాళ్లతో దాడి చేశాడు. ఈ దాడిలో ఐదారుగురు గాయపడ్డారు. అదే సమయంలో అక్కడున్న శేఖర్ అనే యాచకుడితో వాగ్వాదానికి దిగాడు. అది కాస్త కొట్లాటకు దారితీసింది. ఈ క్రమంలో తన చేతిలోని కర్ర, కత్తితో శేఖర్ తలపై బలంగా మోదాడు. అక్కడ ఉన్న యాచకురాలు కల్పన అడ్డుకోగా.. ఆమెనూ కర్రతో కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. అక్కడే పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న సుబ్రహ్మణ్యం సర్ది చెప్పేందుకు ప్రయత్నించగా, అతన్నీ సైకో గాయపరిచాడు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వచ్చి శేఖర్‌ను రుయాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మరో ఇద్దరు రుయాలో చికిత్స పొందుతున్నారు. సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలిపిరి సీఐ రాంకిషోర్ సైకోపై లునటిక్ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

# స్టీల్‌ప్లాంటులో బొగ్గు బుగ్గి

## బాయిలర్ కోల్ యార్డులో ఐదు రోజులుగా మంటలు.. సిబ్బంది తొలగింపుతో పర్యవేక్షణ లోపం.. పట్టించుకోని యాజమాన్యం

విశాఖపట్నం, జూలై 8(టుడే విదుర): స్టీల్ ప్లాంటులోని బాయిలర్ కోల్ యార్డులో గత ఐదు రోజులుగా బొగ్గు కాలిపోతోంది. అయినా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. స్టీల్‌ప్లాంటులో థర్మల్ విద్యుత్ కేంద్రం నడపడానికి ఈ బాయిలర్ కోల్‌ను వినియోగిస్తారు. ఇది అత్యధిక కెలోరిఫిక్ విలువ కలిగినది. అంటే దీన్ని మండిస్తే అత్యధిక వేడిని విడుదల చేస్తుంది. బూడిద శాతం తక్కువగా ఉ ంటుంది. ఎండలో వదిలేస్తే అధిక ఉష్ణోగ్రతకు దానంతట అదే మండుతుంది. అందుకే దీనిని నిల్వ చేసే రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటులో ప్రత్యేకంగా పర్యవేక్షించడానికి కాంట్రాక్టు కార్మికులు ఉంటారు. వారు నిత్యం ఈ బొగ్గుపై నీటిని చిమ్ముతుంటారు. దానివల్ల ఎండలకు మండకుండా ఉంటుంది. అయితే యాజమాన్యం నిర్వహణ వ్యయం తగ్గించేందుకు ఇటీవల దాదాపు ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించింది. దాంతో యార్డుల్లో ఏమి జరిగినా చర్యలు చేపట్టేవారు కరవయ్యారు.




వాస్తవానికి ఈ విలువైన బొగ్గును ఇలా ఆరుబయట వదిలేయకుండా షెడ్లు నిర్మించి, వాటిలో నిల్వ చేయాల్సి ఉంది. దానికి అనవసర వ్యయం ఎందుకంటూ బయట వదిలేస్తున్నారు. ఏ చిన్న తప్పు జరిగినా సంబంధిత ఉ ద్యోగులపై చర్యలు చేపడుతున్న స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇప్పుడు దీనికి ఏమి సమాధానం చెబుతుందని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. మంటలు పెద్దవి కాకముందే తగిన చర్యలు చేపట్టాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇలాంటి వాటిని నిర్లక్ష్యం చేయకుండా తగినంత మంది సిబ్బందిని నియమించాలని కోరుతున్నాయి.

# కుప్పకూలిన వైటీసీ భవనం

## జీగిరాంలో కూలిన వైటీసీ భవనం శిథిలాలు ఖాళీగా ఉండడంతో తప్పిన ప్రమాదం

సాలూరు రూరల్, జూలై 8(టుడే విదుర): సాలూరు మండలం జీగిరాంలో ఉన్న వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్) భవనం ఒక్కసారిగా కూలిపోయింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ భవనం బాగా నానిపోయి ఉంది. దీంతో కురిసిన వర్షాలకు కూలిపోయింది. ఈ భవనం ప్రస్తుతం ఖాళీగా ఉంది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. సాలూరు నియోజకవర్గ గిరిజనులకు వృత్తి విద్యలో శిక్షణకు ఈ భవనాన్ని వినియోగించేవారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ భవనం రెండున్నర దశాబ్దాల కిందట నిర్మించారు. ఐటీడీఏ, వెలుగు ఆధ్వర్యంలో టైలరింగ్, రాడ్ బెండింగ్, వెల్డింగ్ తదితర వృత్తి విద్యలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారు. కొన్ని సంవత్సరాలుగా ఇది



నిరుపయోగంగా ఉంది. ఈ భవనంలో ఎటువంటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం లేదు. గుమడాంలో వైటీసీ నిర్మాణంతో అక్కడే శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీని వల్ల భవనం కూలిపోయినా..ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. దీంతో పరిసరాల్లోని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# నాగావళికి స్వల్ప వరద

## స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు వరద ప్రవాహం



గరుగుబిల్లి, జూలై 8(టుడే విదుర):తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి స్వల్ప వరద పోటెత్తింది. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఎగువ ప్రాంతాల నుంచి సుమారు 5 వేల క్యూసెక్కులకు పైగా ప్రవాహం నదిలోకి చేరుతోంది. అధికారులు ముందస్తుగా స్పిల్‌వే గేట్ల నుంచి దిగువ ప్రాంతాలకు 4,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం వర్షాల కారణంగా రైతులకు సాగునీరు అవసరం లేకపోవడంతో పాత బ్యారేజీ పరిధిలోని రెండు కాలువల నుంచి సాగునీరు విడుదల చేయలేదు. ఉల్లిభద్ర పరిధిలోని కుడి ప్రధాన కాలువ నుంచి చెరువులను నింపుకొనేందుకు ముందస్తుగా 100 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.90 మీటర్ల నీటి నిల్వ ఉంది. వరద కారణంగా కొంతమేర దిగువకు విడుదల చేస్తున్నారు. 2.534 టీఎంసీలకు గాను 1.848 టీఎంసీల నిల్వ ఉంది. వరద ప్రవాహం అధికంగా వచ్చినా... నదీ తీరవాసులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మ?థరావు తెలిపారు.

# ఢీకొట్టుకున్న కార్లు

## ప్రముఖ వైద్యుడికి గాయాలు



బాపట్ల :జూలై 8(టుడే విదుర): రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ప్రముఖ వైద్యులు మిండాల వెంకటేశ్వర్లుకు గాయాలైన ఘటన మంగళవారం బాపట్ల లో జరిగింది. బాపట్ల గుంటూరు రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న కార్లు ఢీకొట్టుకోవడంతో బాపట్ల వైపు నుండి గుంటూరు వైపు వెళుతున్న బాపట్లకు చెందిన ప్రముఖ వైద్యులు మిండాల వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి బాపట్ల రూరల్ పోలీసులు చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వినతులు పెండింగ్ ఉండకూడదు

## వృద్ధురాలి సమస్యను వింటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్,జూలై 8(టుడే విదుర):అర్జీలు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జెడ్పీ సమావే శ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదికలో ఆయన జేసీ ఫ ర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అర్జీలను స్వీకరించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌పై అధికారులు దృష్టి సారించా లని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వ రరావు, ఉప కలెక్టర్ పద్మావతి, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో కార్తీక పౌర్ణమి రోజు (నవంబరు 5)న నిర్వహించే బాలి జాతరకు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు ఇవ్వాలని, మహాశివరాత్రి మహోత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నాయుడుగారి రాజశేఖర్ కలెక్టర్‌ను కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

# మన్యంలో అద్దె బస్సు డ్రైవర్ల నిరసన



మన్యం :జూలై 8(టుడే విదుర): వేతన ఒప్పందం అమలు చేయాలని కోరుతుంటే, అక్రమ కేసులు పెట్టడం అన్యాయం అని మన్యం ఆర్టీసీ డిపో ముందు అద్దె బస్సు డ్రైవర్లు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు.

# ఇదిగో...అదిగో...

**యుహెచ్-3హెచ్ మ్యూజియం ప్రారంభోత్సవంలో జాప్యం**
**ఆరు నెలలుగా ఎదురుచూపులు**
**ఆదాయం కోల్పోతున్న వీఎంఆర్‌డీఏ**

(విశాఖపట్నంజూలై 8(టుడే విదుర):పర్యాటక అభివృద్ధిలో భాగంగా విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) బీచ్‌రోడ్డులో రూ.2.2 కోట్లతో హెలికాప్టర్ మ్యూజియం నిర్మించింది. దీని పనులు ఈ ఏడాది జనవరిలోనే పూర్తయ్యాయి. అయితే ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు తీరిక దొరకడం లేదు. ఆరు నెలల నుంచి ఇదిగో...అదిగో అంటూ వాయిదా వేసుకుంటూ వస్తున్నారు.టీయూ-142 యుద్ధ విమానం, సీ హ్యారియర్ హెలికాప్టర్ మ్యూజియాన్ని ఆనుకుని...హెలికాప్టర్ మ్యూజియం ఏర్పాటుచేశారు. చుట్టూ అద్దాలు ఏర్పాటుచేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. విశాఖపట్నం వచ్చే పర్యాటకులు కురుసుర సబ్‌మెరైన్, టీయూ-142, సీ హ్యారియర్ మ్యూజియాలతో పాటు దీనిని కూడా చూడడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అయితే అది ఇంకా ప్రారంభించలేదని అక్కడి సిబ్బంది చెబుతుండడంతో ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. దీనివల్ల వీఎంఆర్‌డీఏ ఆదాయాన్ని కూడా కోల్పోతుంది. సీఎం చంద్రబాబునాయుడుతో పాటు ఐటీ శాఖ మంత్రి లోకేశ్, పురపాలక శాఖ మంత్రి నారాయణ తరచూ నగరానికి వస్తున్నారు. పది నిమిషాలు తీరిక చేసుకుంటే దీని ప్రారంభోత్సవం జరిగిపోతుంది. పర్యాటకులకు అందుబాటులోకి వస్తుంది. దీనిపై తక్షణమే తగిన నిర్ణయం తీసుకొని ఈ మ్యూజియాన్ని పర్యాటకులకు




అందుబాటులోకి తీసుకురావలసి ఉంది.పదిహేడేళ్లు సేవలుయుహెచ్-3 హెచ్ హెలికాప్టర్ నేవీలో పదిహేడేళ్లు సేవలు అందించింది. తీర ప్రాంత రక్షణ, విపత్తు సమయాల్లో సహాయక చర్యలు, సముద్రంలో తప్పిపోయిన వారిని గుర్తించి, రక్షించడం వంటి విధులు విజయవంతంగా నిర్వహించింది. గత ఏడాది జూన్ 28వ తేదీన ఐఎన్ఎస్ డేగాలో డీ కమిషనింగ్ జరిగింది. జిల్లాకు ఇస్తామని మ్యూజియంగా మార్చాలని తూర్పు నౌకాదళం కోరగా కలెక్టర్ అంగీకరించారు. దానికి అవసరమైన 23 సెంట్ల స్థలాన్ని బీచ్‌రోడ్డులో కేటాయించారు. సీఎం చంద్రబాబు దీనిపై సమీక్షించినప్పుడు 2025లో న్యూఇయర్ బహుమతిగా అందిస్తామని వీఎంఆర్‌డీఏ అధికారులు చెప్పారు. అనుకున్నట్టుగానే సంక్రాంతికి సిద్ధం చేశారు. అప్పటి నుంచి ప్రారంభోత్సవానికి ఎదురు చూస్తోంది.

# సిక్కోలు జీడికి జాతీయ గుర్తింపు

- ఈనెల 14న ఢిల్లీలో అవార్డు ప్రదానం
- ఏపీ ఉద్యాన రంగానికే మైలురాయి
- తితలీ నష్టం తర్వాత పునరుజ్జీవనం
- ప్రాసెసింగ్ పరిశ్రమలకు ఊపు





శ్రీకాకుళం,జూలై 8(టుడే విదుర): సిక్కోలు జీడిపప్పుకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఉద్యాన రంగంలో వన్ డిస్ట్రిక్ట్ (ఓడీఓపీ) కార్యక్రమంలో భాగంగా 'జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు (2025) దక్కింది. ఈ నెల 14న ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి అవార్డుల ప్రదానోత్సవానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్ హాజరయ్యే అవకాశం ఉంది. ఈ ఘనత జిల్లాకే కాకుండా ఆంధ్రప్రదేశ్ ఉద్యానరంగానికే ఒక మైలురాయి అని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.జీడి మామిడి.. ప్రధాన జీవనాధార పంట..జిల్లాలో జీడి పంట ప్రధాన జీవనాధారంగా ఉంది. 24,000 హెక్టార్లలో జీడిమామిడి సాగు అవుతోంది. ఇందులో 22,000 హెక్టార్లు దిగుబడినిచ్చే తోటలే. పలాస, మందస, వజ్రపుకొత్తూరు, సోంపేట వంటి ఉద్దానం మండలాల్లో జీడిమామిడి అత్యధికంగా సాగు చేస్తున్నారు. ఈ తోటల్లో సంకరజాతి రకాలైన బీపీపీ-8, బీపీపీ-6, వీ-4 వంటి అధిక దిగుబడినిచ్చే రకాలే కాకుండా వంశపారంపర్య జాతులూ ఉన్నాయి. ఈ పంట ద్వారా 1,05,000 కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగాను జీవనం దొరుకుతోంది. వీరిలో సన్నకారు రైతులు 31,000, చిన్న రైతులు 56,000, పెద్ద రైతులు 18,000 మంది ఉన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇచ్చే ఈ పంట రైతులకు స్థిర ఆదాయాన్ని కలిగిస్తోంది.

# అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు

## వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ
## ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం క్రైం, జూలై 8(టుడే విదుర):ప్ర జల నుంచి అందే అర్జీలను సత్వరమే పరిష్కరించి.. బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కా ర్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్య క్రమంలో ఎస్పీ 72 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరిం చి.. వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యా దుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. వృద్ధులు, దివ్యాంగులు, అర్జీదారులతో మా ట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలను జూమ్ కాన్ఫరెన్స్‌లో తక్షణమే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేశారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చే యాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులకు అ త్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ని ర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కా రం చూపాలని సూచించారు. అర్జీలకు సంబం ధించి తీసుకున్న చర్యలను నిర్ణీత సమయం లో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూ పంలో పంపించాలని ఎస్పీ ఆదేశించారు. అందిన అర్జీలలో కుటుంబ సమస్య లు, భార్యాభర్తల గొడవలు, మోసపూరితమైన, ఆస్తి తగాదాలు తదితర అంశాలపై ఉన్నాయి.కానిస్టేబుల్ వేధిస్తున్నారుపోలాకి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాని స్టేబుల్ తనను వేధింపులకు గురి చేస్తున్నా రంటూ అదే మండలం జగన్నాథపురం గ్రా మానికి చెందిన మిరియాపల్లి కృష్ణ సోమవా రం గ్రీవెన్స్‌లో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి ఫి ర్యాదు చేశారు. జగన్నాథపురంలో తన ఇంటి పక్కన ఉన్న స్థలం తోవను కానిస్టేబుల్ కబ్జా చేశారని ఆరోపించారు. దానిని అడ్డుకునేం దుకు ప్రయత్నించినందుకు కొద్ది రోజులుగా తనను వేధిస్తున్నారని తెలిపారు. నరసన్న పేట సీఐ, పోలాకి ఎస్ఐకి ఫి ర్యాదు చేసినా కానిస్టేబుల్‌పై చర్యలు చేపట్టడం లేదని తెలిపారు.

# రబీ పంటలను ప్రభుత్వమే కొనాలి




పల్నాడు జిల్లా జూలై 8(టుడే విదుర): కందులతో పాటు రబీలో రైతులు సాగు చేసిన అపరాలు, ఇతర అన్ని పంటలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద రైతులతో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ జిల్లాలో వేలాది ఎకరాలలో కంది సాగు చేశారని, వేల టన్నులు కందులు నిల్వలుండగా మార్క్‌ఫెడ్ ద్వారా నామమాత్రపు కొనుగోళ్లతో సరిపెట్టారన్నారు. నూజెండ్ల మండలం ములకలూరు గ్రామంలో 70 మంది రైతుల వద్ద 200 టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. రబీ ధాన్యం కొనుగోలు అంతంత మాత్రంగానే జరిగినా ఇప్పటికీ నగదు ఇవ్వలేదన్నారు. రైతుల దగ్గర ఉన్న అన్ని పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎన్నికలప్పుడు నమ్మించిన కూటమి ఇప్పుడు మోసం చేసిందని విమర్శించారు. అప్పులతో సాగు చేపట్టిన రైతులకు పంట చేతికి రాగానే దళారులు ధరలు తగ్గించి రైతులను లూటీ చేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నేరుగా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సిహెచ్.సురేష్, ఆర్.మునివెంకటేశ్వర్లు, రైతులు ఏడుకొండలు, వెంకటరావు, అంజిబాబు, వెంకటేశ్వర్లు, రామారావు పాల్గొన్నారు.

# పరిష్కరించకుంటే 12 నుండి సమ్మె

పల్నాడు జిల్లాజూలై 8(టుడే విదుర): వేతనాలు పెంచి, దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మూణ్ణెల్లుగా ఆందోళన చేస్తున్నా, యూనియన్ నాయకుల ద్వారా రాయబారం పంపినీ కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ అన్నారు. నరసరావుపేట పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్దగల మహాత్మా గాంధీ విగ్రహం చుట్టూ రి కార్మికులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. సిలార్ మసూద్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 12 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు.




నిత్యావసరాల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నా 11 ఏళ్ల నుండి కార్మికుల వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. కార్మికులు సమ్మెలోకి వెళితే ప్రజలకు కలిగే అసౌకర్యానికి ప్రభుత్వం, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. జీఓ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, గత సమ్మెకాలపు ఒప్పం దాలు అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్మికులపై అధికా రుల, రాజకీయ వేధింపులు ఆపాలని, పెరిగిన పట్టణీకరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టి ఖర్చులు ఇవ్వాలని కోరా రు.

# తుమ్మలచెరువులో ఘనంగా మొహర్రం

తర్లుపాడు :జూలై 8(టుడే విదుర): మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం వేడుకలు మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. పెద్ద సరిగెత్తు, సోమవారం పీర్ల నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. అర్ధరాత్రి పెద్ద సరిగెత్తు పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొని కాసిం స్వామి పీర్లకు కాయ కర్పూరాలు సమర్పించి వారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పెద్ద సరిగెత్తు కార్యక్రమానికి ఎక్కువగా సంతానం లేని వారు, వ్యాధిగ్రస్తులు,



సంతానం కలిగినవారు, వ్యాధుల నుంచి ఉపశమనం లభించిన వారు పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు. అర్ధరాత్రి కాసిం స్వామి పీర్లను గ్రామోత్సవం నిర్వహించి, భక్తి శ్రద్ధలతో, తడి బట్టలతో భారీ అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఈ యొక్క కార్యక్రమానికి సుమారు 70,80 వేల మంది భక్తులు కాసిం స్వామి వారిని దర్శించుకున్నట్లు ముజావర్లు తెలిపారు.

# చలిమంటలు పెట్టుకున్నారు

# కంటి మీద కునుకు లేకుండా కాపలా ఉన్నారు

మొయినాబాద్,:జూలై 8(టుడే విదుర):దశాబ్దాలుగా భూమిని నమ్ముకుని.. సాగు చేసుకుంటూ జీవనాధారం పొందుతున్న రైతులకు ప్రభుత్వం కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. రైతులకు బువ్వ పెట్టే భూమిని ప్రభుత్వం అప్పనంగా తీసుకునే ప్రయత్నం చేస్తూ రైతులను నిర్వాసితులను చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. కంటి తుడుపుగా పరిహారం చెల్లిస్తే తీసుకునేది లేదని.. భూములను వదలమని రైతులు మొండిగా వ్యవహరిస్తున్నారు. ఏ సమయంలో ప్రభుత్వం పోలీసులను పెట్టి స్వాధీనం చేసుకుంటుందోనని భయంతోనే రైతులు భూముల వద్ద రాత్రి, పగలు కాపలా ఉంటున్నారు. ఆకలికి ఓర్చుకుంటూ రాత్రి సమయంలో చలి మంటలు కాస్తూ భూమికి



కాపాలుగా ఉంటున్నారు. ఈ దయనీయ స్థితి రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కేపల్లి రైతులకు ఏర్పడింది.

# పురుగుల మందు తాగి

# యువకుడి ఆత్మహత్యాయత్నం



వాంకిడి, జూలై 8(టుడే విదుర):కొమరం భీమ్ జిల్లా వాంకిడి మండలంలోని బనార్ కోసార గ్రామానికి చెందిన పవన్ (23) రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పవన్ రాత్రి అతిగా మద్యం సేవించి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. %దీంతో మనస్తాపానికి గురైన పవన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు గమనించి పవన్‌కు ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని తెలుస్తోంది.

# పరిహారం తేల్చకుండానే

# భూములు తీసుకూంటారా..?

◆ఆగ్రహం వ్యక్తం చేసిన భూబాధితులు

◆మాకు చెప్పకుండా.. న్యాయం చేయకుండా ఎలా గోశాలకు భూమి పూజ చేస్తారు..?

◆భూమి పూజ చేసిన ఎమ్మెల్యేను అడ్డుకునే యత్నం

◆రక్షణగా నిలిచి అక్కడి నుంచి పంపించేసిన పోలీసులు

◆భూమిలో బలవంతంగా జేసీబీతో పనులు.. అడ్డుకున్న రైతులు

◆జేసీబీని అడ్డుకోవడంతో రైతులపై దాడి చేసిన పోలీసులు

◆పోలీసులు, రైతుల మధ్య తోపులాట, ఉద్రిక్తత




జూలై 8(టుడే విదుర):ప్రభుత్వం గోశాలకు తీసుకోవాలని భావించిన ఎన్కేపల్లి భూముల వ్యవహారం రోజురోజుకూ ఉద్రిక్తతకు దారి తీస్తున్నది. ప్రభుత్వం ఇస్తామని చెప్పిన పరిహారాన్ని భూబాధితులు ఒప్పుకోకపోవడం.. వారు అడిగిన పరిహారాన్ని సర్కార్ ఇచ్చేందుకు సుముఖంగా లేకపోవడంతో భూములను ఇచ్చేది లేదని అన్నదాతలు తెగేసి చెబుతున్నారు. దీంతో బలవంతంగానైనా భూములను తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించడంతో సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్యతో అధికారులు భూమి పూజ చేయించారు. తమకు చెప్పకుండా, పరిహారాన్ని నిర్ణయించకుండా తమ భూముల్లో ఎలా భూమి పూజ చేస్తారని అన్నదాతలు ఒక్కసారిగా ఆగ్రహం చెందడంతో పరిస్థితి చేయి దాటిపోయేలా ఉందని భావించిన అధికారులు, పోలీసులు ఎమ్మెల్యేను అక్కడి నుంచి పంపించేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి, ఎన్కేపల్లి గ్రామ రెవెన్యూలో గల సర్వేనం.180లోని 99.14 ఎకరాల భూములను ప్రభుత్వం గోశాల నిర్మాణానికి కేటాయించిన విషయం తెలిసిందే. గోశాల నిర్మాణానికి భూములను త్వరగా సేకరించాలని రెవెన్యూ అధికారులను సర్కారు ఆదేశించడంతో శనివారం వారు పోలీస్ పహారాలో భూములను సర్వే చేశారు. ప్రభుత్వం ఎకరానికి 300 గజాల స్థలం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని.. మీరు ఒప్పుకోకపోతే సోమవారం నుంచి పనులను ప్రారంభిస్తారని రెవెన్యూ అధికారులు రైతులకు అల్టిమేటం జారీ చేశారు. కాగా, ఆదివారం రైతులకు తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ఫోన్ చేసి సోమవారం ఎమ్మెల్యే యాదయ్య మీతో మాట్లాడుతారని సోమవారం ఉదయం 8 గంటల వరకు భూముల వద్దకు రావాలని సూచించారు. ఎమ్మెల్యేతో ఎకరానికి 500 గజాల స్థలం ఇవ్వాలని కోరుదామని రైతులందరూ ఎంతో ఉత్సాహంతో ఉన్నారు. అయితే, ఎమ్మెల్యే రైతులకు చెప్పిన సమయం కంటే ముందే (7:30 గంటలకు) భూముల వద్దకు వచ్చారు. అప్పటికీ రైతులు రాకపోయేసరికి చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ఎమ్మెల్యేతో భూమి పూజను ప్రారంభించారు. ఎమ్మెల్యే భూమి పూజ చేస్తున్నారని సమాచారం అందుకున్న రైతులు తమకు చెప్పకుండా, పరిహారాన్ని నిర్ణయించకుండా తమ భూముల్లో ఎలా భూమి పూజ చేస్తారని ఆగ్రహంతో అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యేను చుట్టుముట్టారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితి చేయి దాటిపోయేలా ఉందని భావించి.. వారు రక్షణగా ఉండి ఎమ్మెల్యేను అక్కడి నుంచి పంపించేశారు. మీరు రాకపోయేసరికి ఎమ్మెల్యేతో భూమి పూజ చేయించినట్లు అధికారులు రైతులకు చెప్పారు. దీంతో ఆగ్రహం చెందిన అన్నదాతలు ఆందోళన చేపట్టి ముఖ్యమంత్రి డౌన్‌డౌన్.. ఎమ్మెల్యే డౌన్‌డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రాణాలు పోయినా.. భూములిచ్చేది లేదని తేల్చి చెప్పారు.

# పేరు మారిస్తే చర్యలు మాఫీ?

ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా..పర్యవేక్షణ లోపం

అమ్మ కడుపులోనే కన్నుమూస్తున్న ఆడ శిశువులు

భువనగిరి టౌన, జూలై 8(టుడే విదుర): నిబంధనలు ఉల్లంఘించి పట్టుబడిన ల్యాబ్‌లు, ఆసుపత్రులు పేరు మార్చుకుంటే చర్యలు మాఫీ అన్నట్లుగా మారింది. అవే భవనాలు, ఆరోపణలు ఎదుర్కొన్న ఆ వైద్యులే, ఆ సిబ్బందే కొత్త పేర్లతో ఆసుపత్రులను, ల్యాబ్‌లను లాభాపేక్ష ధోరణితో నిర్వహిస్తూ దారుణాలు సాగిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లపై వైద్య, పోలీస్ శాఖల పర్యవేక్షణ, నిఘా లోపంతో అమ్మ కడుపులోనే ఆడ శిశువులు భ్రూణహత్యకు గురవుతున్నారు. ఆడ పిల్లంటే ఆర్థిక భారం అనే భావనకు తోడు.. ఈ కాన్పులోనైనా కొడుకు కావాలనే తల్లిదండ్రుల ఆశల కారణంగా బాహ్య ప్రపంచాన్ని చూడక ముందే ఆడ శిశువును శాశ్వతంగా కన్నుమూస్తున్నారు. ఈ తరహా వెలుగు చూస్తున్న అమానుషాలు కొన్నైతే చీకటిలో మగ్గిపోతున్నవే అధికమని పలువురు వాపోతున్నారు. ఈ క్రమంలో భువనగిరిలో ఒకే ఆస్పత్రిలో ఒకే రోజున ఏకకాలంలో అర్హత లేని వైద్య దంపతులు రెండు అబార్షన్లు చేయడంతో ఇద్దరు ఆడ శిశువలు కన్నుమూసిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. ల్యాబ్ యజమాని ఒక్కో లింగ నిర్దారణ పరీక్షకు రూ.16వేలు, ఒక్కో అబార్షనకు ఆసుపత్రి నిర్వాహకులు




రూ.30వేలు ముందస్తు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ ఇంకా అధిక మొత్తంలోనే ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఈ తరహా లింగ నిర్ధారణ పరీక్షలు అబార్షన్లు జిల్లా కేంద్రం భువనగిరితో పాటు ఇతర ప్రాంతాల్లోని పలు ఆసుపత్రులు, ల్యాబ్‌లలో నిరంతరాయంగా సాగుతున్నాయని ఐఎంఏ ప్రతినిధులే అంతర్గంతంగా మాట్లాడుకుంటుండడం, ఆడపిల్లపై వివక్ష భ్రూణ హత్యల తీవ్రతను తెలియజేస్తోంది. ఇలాంటి సంఘనలు వెలుగు చూసిన ప్రతీ సందర్భంలో నోటీసులు, తనిఖీల పేరిట అధికారులు హడాహుడి చేసి అనంతరం గుర్తుతెలియని కారణాలతో గుప్తంగా ఉండిపోతుండడం పరిపాటిగా మారుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇటీవలే జిల్లాలోని 41స్కానింగ్ సెంటర్లు, పలు ఆసుపత్రుల్లో తనిఖీలు చేసిన అధికారులు 35 స్కానింగ్ సెంటర్లను నోటీసులు ఇచ్చి తదుపరి చర్యలను విస్మరించినట్లు ఆరోపణలున్నాయి.

# రోడ్డును ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు



సూర్యాపేట క్రైం, జూలై 8(టుడే విదుర):రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. జిల్లా కేంద్రంలో ఖమ్మం అండర్ పాస్ వద్ద రాత్రి ఎస్పీ తన సిబ్బందితో కలిసి పర్యటించారు. స్థానిక వ్యాపారులతో మాట్లాడుతూ రోడ్డు ఆక్రమణలతో తలెత్తే సమస్యలపై అవగాహన కల్పించారు. రోడ్డు అక్రమించిన వ్యాపారుల బోర్డులను సిబ్బందితో తొలగింపజేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాకేంద్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రజలు వారి అవసరాల నిమిత్తం జిల్లాకేంద్రానికి వచ్చి పోతుంటారన్నారు. దీంతో వాహనాల రద్దీ పెరిగిందన్నారు. దానికి అనుగుణంగా పోలీసులు వాహనాల రద్దీని పునరుద్ధరిస్తూ పని చేస్తున్నారని తెలిపారు. రోడ్లను ఆక్రమించి వ్యాపారులు చేయడంతో వాహనదారులు, సాధారణ ప్రజలు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుకాణదారులు, చిరువ్యాపారులు ఎవరూ రోడ్లపై ఇక నుంచి వ్యాపారులు చేయవద్దని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. మునిసిపల్ అధికారులతో కలిసి జిల్లా కేంద్రంలో రోడ్డు ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. వ్యాపారులు, దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రోడ్ల ఆక్రమణ విషయంలో దుకాణదారులు పోలీసు వారికి సహకరించాలని ఎస్పీ సూచించారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలకు మహర్దశ

బంబార గిరిజన ఆశ్రమ పాఠశాల

– ఉమ్మడి జిల్లాకు రూ.11.73 కోట్లు నిధులు విడుదల

పాఠశాలల్లో తీరనున్న సమస్యలు

వాంకిడి, జూలై 8(టుడే విదుర): గిరిజన ఆశ్రమ పాఠశాలల దశ మారనుంది. కొన్నేళ్ల నుంచి ఆశ్రమ పాఠశాలలకు నిధులు విడుదలకాక విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. కనీస సౌకర్యాల కొరత, సంత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. గిరిజన ఆశ్రమపాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో గిరిజన ఆశ్రమ పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఊట్నూర్ పరిధిలోని కుమరంభీం, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని 149 ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 34,910 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. వారికి అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, బాత్‌రూం సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక అవస్థలకు గురవుతున్నారు. దీంతో




ఆశ్రమపాఠశాలల్లో వసతుల కల్పనకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖకు రూ. 11.73 కోట్లు నిధులు మంజూరు చేసింది.విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే ఆశ్రమ పాఠశాలలు సమస్యలతో స్వాగతం పలుకుతుంటాయి. ప్రతీ సంవత్సరం ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు వినతులు ఇవ్వడం మాములైంది. ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో కనీస సౌకర్యాల కల్పనకోసం నిధులను విడుదల చేసింది.



# టుడే వినోదం

## రాముడి పారితోషికం ఎంత



రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్న 'రామాయణ' చిత్రం ఫస్ట్ లుక్ ఇటీవల విడుదలై అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ఇందులో విఎఫ్ఎక్స్ వర్క్ అద్భుతంగా ఉండబోతుందని ఈ సినిమా గ్లింప్స్ చూడగానే అందరికీ అర్థమైంది. మరో విషయం ఏమిటంటే రూ. 1600 కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ చిత్రం ఇది. ఈ సినిమాలో రాముడిగా నటిస్తున్న రణ్‌బీర్ కపూర్ పారితోషికం ఎంతో తెలుసా?.. రూ .150 కోట్లు. రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న 'రామాయణ' కోసం ఆయన అడిగిన పారితోషికం ఇచ్చి వర్క్ చేయించుకుంటున్నారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఇక సీతగా నటిస్తున్న సాయిపల్లవికి రెండు భాగాలకు కలిపి రూ. 12 కోట్లు ఇస్తున్నారు. రావణుడిగా నటిస్తున్న యశ్ ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామి కనుక ఖర్చులకు తప్ప పారితోషికంగా ఏమీ తీసుకోవడం లేదు.రామానంద సాగర్ రూపొందించిన 'రామాయణ్' సీరియల్‌లో అరుణ్ గోవిల్ శ్రీరాముడిగా, దీపిక సీతగా నటించి కోట్లాది మంది హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారు. 1987లో ఆ సీరియల్ వచ్చింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత 'రామాయణ' చిత్రంలోనూ అరుణ్ గోవిల్ నటిస్తున్నారు. ఈసారి ఆయన దశరథుడి పాత్ర చేస్తుండడం గమనార్హం.

## అనుపమ సినిమా.. మోహన్‌లాల్‌ను నిందించారు..




కేంద్రమంత్రి, నటుడు సురేశ్ గోపి మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ నటించిన చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సెన్సార్ సమస్యతో ఈ సినిమాలకు ఇబ్బందులు ఎదురైన సంగతి తెలిసిందే! ప్రస్తుతం ఈ విషయంలో మాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఈ వివాదం గురించి తాజాగా నిర్మాత సురేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. మోహన్‌లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కించిన 'ఎల్ 2: ఎంపురాన్' చిత్రాన్ని నిందించారు. ఆ సినిమా నుంచే పరిస్థితులు ఇలా మారాయని ఆయన అన్నారు. ఈ సమస్యలు అన్నింటికీ 'ఎల్ 2: ఎంపురాన్' సినిమానే అని ఆరోపించారు. "ఎంపురాన్' సినిమా విడుదల సమయంలో పలు వివాదాలు తెరపైకి వచ్చాయి. దీంతో సెన్సార్ బోర్డ్ దానిని మరోసారి సెన్సార్ చేయాల్సి వచ్చింది. అక్కడే అసలైన సమస్యలు మొదలయ్యాయి. అప్పటి నుంచి ప్రతి సినిమా విషయంలో సెన్సార్ బోర్డు కఠినంగా వ్యవహరిస్తోంది. ఎన్నో సార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నారు. దాని వల్లే ఈ సమస్య. ప్రస్తుతం ఈ టైటిల్ వివాదం న్యాయస్థానంలో ఉంది. టైటిల్‌లో జానకి అనే పేరు కొనసాగించవచ్చా? లేదా? అనేది న్యాయస్థానం నిర్ణయించనుంది. సరైన తీర్పు వస్తుందని ఆశిస్తున్నా" అని నిర్మాత జె.ఫణీంద్రకుమార్ అన్నారు. థ్రిల్లర్ కథాంశంతో 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సినిమా తెరకెక్కింది. సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తుందనేది ఉప శీర్షిక. కోర్ట్‌రూమ్ డ్రామాగా సాగే ఈ సినిమాకు సెన్సార్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సీతాదేవి మరో పేరు జానకి కావడం, సినిమాలో దాడికి గురైన మహిళా పాత్రకు ఆ పేరు పెట్టడం సమంజసం కాదని సెన్సార్ బోర్డు చిత్ర బృందానికి తెలిపింది. సినిమా పేరు మార్చాలని కోరింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి సర్టిఫికెట్ జారీ చేయడంలో జాప్యాన్ని వ్యతిరేకిస్తూ నిర్మాతలు కోర్టును ఆశ్రయించారు. ఈ నెల 9న కోర్టు వాదనలు విననుంది. ప్రవీణ్ నారాయణన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఇందులో జానకిగా అనుపమ కనిపించనున్నారు. లాయర్‌గా సురేశ్ గోపి నటించారు.

## కీరవాణి తండ్రి శివశక్తి దత్త ఇకలేరు



ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి ఇంట విషాదం చోటు చేసుకుంది. ఆయన తండ్రి కోడూరి శివశక్తి దత్త కన్నుమూశారు. సోమవారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. గేయ రచయిత, స్క్రీన్‌రైటర్‌గా టాలీవుడ్‌లో మంచి గుర్తింపు పొందారు. %శివశక్తి దత్త అసలు పేరు కోడూరి సుబ్బారావు, అక్టోబర్ 8 1932లో కొవ్వూరులో జన్మించారు. టాలీవుడ్ టాప్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళికి శివశక్తి దత్త పెదనాన్న అవుతారు. నాగార్జున నటించిన 'జానకిరాముడు' చిత్రానికి స్క్రీన్‌రైటర్‌గా, పని చేసిన ఆయన 2007లో 'చంద్రహాస్' చిత్రాన్ని డైరక్ట్ చేశారు. గేయ రచయితగా టాలీవుడ్‌కి ఎన్నో హిట్స్ సాంగ్స్ ఇచ్చారు.సై సినిమాల్లో నల్లా నల్లాని కళ్ల పాట నుంచి గతేడాది వచ్చిన హనుమాన్ థీమ్ సాంగ్ వరకూ ఎన్నో హిట్ పాటలకు సాహిత్యం అందించారు. బాహుబలిలో మమతల తల్లి, సాహోరే బాహుబలి, ఆర్ఆర్ఆర్‌లో 'రామం రాఘవం' పాటలను ఆయనే రాశారు. శివశక్తి దత్త మరణంతో చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. సినీ ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరగనున్నాయని కటుంబ సభ్యులు తెలిపారు.

## నయనతార డాక్యుమెంటరీపై మరో కేసు




సినీ నటి నయనతార డాక్యుమెంటరీకి వ్యతిరేకంగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. విఘ్నేష్ శివన్-నయనతారల వివాహ డాక్యుమెంటరీ గత ఏడాది నవంబరులో 'నెట్‌ఫ్లిక్స్'లో విడుదలైన విషయం తెలిసిందే తొలుత ఈ డాక్యుమెంటరీ ట్రైలర్ విడుదల సమయంలో, అందులో 'నానుం రౌడీ దాన్' చిత్రంలోని మూడు నిమిషాల షూటింగ్ ఫుటేజీ ఉంది. ఈ వ్యవహారంపై నటుడు ధనుష్‌కు చెందిన వండర్ బార్స్ సంస్థ రూ.10 కోట్ల నష్టపరిహారం కోరుతూ కేసు వేసింది. ఈ కేసు హైకోర్టు విచారణలో ఉంది. తాజాగా డాక్యుమెంటరీకి వ్యతిరేకంగా మద్రాసు హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. 'చంద్రముఖి' చిత్రంలోని కొన్ని దృశ్యాలు డాక్యుమెంటరీలో అనుమతి లేకుండా వినియోగించారని, అందుకు రూ. 5 కోట్లు నష్టపరిహారం చెల్లించాలంటూ కాపీ రైట్స్ కలిగిన ఏబీ ఇంటర్నేషనల్ పిటిషన్ దాఖలుచేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన హైకోర్టు..రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని డాక్యుమెంటరీ రూపొందించిన డార్క్ స్టూడియో, నెట్‌ఫ్లిక్స్ సంస్థలను ఆదేశించింది.

## యధార్థ కథ ఆధారంగా..



దర్శకుడు బాలాజీ ముత్యాల దర్శకత్వంలో పృథ్వీరాజు, గోలీసోడా మధు ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'మిస్టర్ సోల్జర్'. 'ఫ్రమ్ మిలిటరీ మాధవరం' అనేది ఉపశీర్షిక. వీఆర్ఎమ్ పట్నాయక్, యూఎసఎన్ పట్నాయక్ నిర్మిస్తున్నారు. వచ్చే నెలలో చిత్రం విడుదలవుతోందని మేకర్స్ తెలిపారు. ఓ యధార్థ కథ ఆధారంగా చిత్రాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు.

## బాక్సాఫీస్‌కు తుపాను



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న చిత్రం 'కింగ్‌డమ్'. సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, టీజర్, ఫస్ట్ సింగిల్ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ నెల 31న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా ఓ యాక్షన్ ప్రోమో విడుదల చేసి "ఇది కేవలం సినిమా కాదు. మేము ప్రేమతో నిర్మించిన గొప్ప ప్రపంచం. త్వరలోనే బాక్సాఫీస్ తుపానుకు ఈ చిత్రం నాంది పలుకుతుంది" అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: జోమోన్.టి.జాన్, సంగీతం: అనిరుధ్ రవిచందర్.

టుడే స్పోర్ట్స్

# కోహ్లీ ఫ్రెండ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు.. శిక్ష తప్పదా?




ఐపీఎల్ సెన్సేషన్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు స్టార్ పేసర్ యష్ దయాల్ చిక్కుల్లో పడ్డాడు. అతడిపై ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఇందిరాపురం పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. తన మీద దయాల్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ ఘజియాబాద్‌కు చెందిన ఓ యువతి ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి గ్రీవెన్స్ పోర్టల్‌లో అతడిపై ఫిర్యాదు చేసిందా యువతి. దీంతో భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 69 కింద కేసు నమోదు చేశారు పోలీసులు. వివాహం, ఉద్యోగం లాంటి తప్పుడు వాగ్దానాలతో మోసం చేసిన ఘటనల్లో ఈ సెక్షన్లను ఉపయోగిస్తారు. ఒకవేళ దయాల్ గనుక నేరం చేసినట్లు రుజువైతే మాత్రం అతడికి 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. అలాగే జరిమానా కూడా కట్టాల్సి ఉంటుంది. ఈ కేసులో బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసిన పోలీసులు.. ఇంకా యష్ దయాల్‌ను విచారించలేదు. త్వరలో అతడ్ని అరెస్ట్ చేస్తారని తెలుస్తోంది. ఆ తర్వాత బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని సమాచారం. కాగా, 2019లో దయాల్‌తో తనకు పరిచయం ఏర్పడిందని, సోషల్ మీడియా ద్వారా అతడ్ని కలిశానని ఫిర్యాదులో పేర్కొంది బాధితురాలు. అప్పటినుంచి తామిద్దరమూ సన్నిహితంగా ఉంటున్నామని, మ్యారేజ్ చేసుకుంటానని హామీ ఇచ్చాడని కంప్లయింట్‌లో రాసుకొచ్చింది బాధితురాలు. బెంగళూరు, ఢిల్లీ, ప్రయాగ్‌రాజ్ సహా కొన్ని ప్రాంతాలకు తీసుకెళ్లి తనతో శారీరక సంబంధాన్ని కొనసాగించాడని ఆమె ఆరోపించింది.

# 400 వద్దనుకున్నాడు





బులవాయో: టెస్టు క్రికెట్‌లో వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా (400 నాటౌట్) అరుదైన రికార్డును అధిగమించాలనేది ప్రతి క్రికెటర్ చిరకాల స్వప్నం. కానీ, ఆ రికార్డుకు కేవలం 33 పరుగుల దూరంలోనే ఉన్నా వద్దనుకున్నాడు. దక్షిణాఫ్రికా తాత్కాలిక కెప్టెన్ వియాన్ ముల్డర్ (334 బంతుల్లో 49 ఫోర్లు, 4 సిక్స్‌లతో 367 నాటౌట్) చరిత్ర సృష్టించే అరుదైన అవకాశాన్ని కాదనుకుని నిస్వార్థంగా ఆలోచించి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. జింబాబ్వేతో జరుగుతున్న రెండో టెస్టులో ఆటకు రెండో రోజు నిన్నటి స్కోరు 465/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా 626/5 వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్ ముల్డర్ త్రిశతకం పూర్తి చేసుకోవడంతోపాటు జోరు మీదున్నాడు. ఈ క్రమంలో లారా క్వాడ్రపుల్ సెంచరీ రికార్డును బద్దలుకొడతాని అందరూ భావించారు. కానీ, 33 పరుగుల దూరంలో ఉండగా దక్షిణాఫ్రికా అనూహ్యంగా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అయితే, సౌతాఫ్రికా తరఫున అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్‌గా హషీమ్ ఆమ్లా (311)ను ముల్డర్ వెనక్కినెట్టాడు. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో 170 రన్స్‌కే కుప్పకూలిన జింబాబ్వే ఫాలో ఆన్‌లో పడింది. సీన్ విలియమ్స్ (83 నాటౌట్)కు సహకారం అందలేదు. స్పిన్నర్ ప్రినెలన్ సుబ్రయన్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 456 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే సోమవారం ఆట ఆఖరికి 51/1 స్కోరు చేసింది.

టెస్టుల్లో రెండో వేగవంతమైన ట్రిపుల్ సెంచరీ చేసిన ఆటగాడిగా ముల్డర్. 297 బంతుల్లో ముల్డర్ మూడొందల మార్క్‌ను అందుకొన్నాడు. 2008లో చెన్నైలో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో సెహ్వాగ్ 278 బంతుల్లోనే త్రిశతకం బాదాడు.

# కష్టాల కడలిని దాటి..ఆకాశమే హద్దుగా ఎదిగి



ఎడ్జ్‌బాస్టన్‌లో టెస్టు విజయం కోసం భారత జట్టు దశాబ్దాలపాటు ఎదురుచూసింది. అయితే బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై పది వికెట్లు పతనం చేయడం ద్వారా ఇంగ్లండ్‌ను కట్టడి చేసిన పేసర్ ఆకాశ్ దీప్ ఈ గెలుపు సంబరాలకు ప్రధాన కారకుల్లో ఒకడు. స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినివ్వడంతో తుది జట్టులోకి వచ్చిన ఆకాశ్ చిరస్మరణీయ ప్రదర్శనతో అబ్బురపర్చాడు. బర్మింగ్‌హామ్ టెస్టుకు ముందు అతడు 7 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీశాడు. దీంతో ఆకాశ్‌కు బదులు అర్ష్‌దీపకు చాన్స్ ఇవ్వాలన్న చర్చలు కూడా జరిగాయి. అయితే కోచ్, కెప్టెన్.. ఆకాశ్‌పై నమ్మకముంచి తుదిజట్టులో చోటు కల్పించారు. ఆ ఇద్దరి నమ్మకాన్ని నిలబెడుతూ ఆకాశ్ ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో అద్భుతంగా బౌలింగ్ చేసి అందరి ప్రశంసలు అందుకున్నాడు. అయితే బిహార్ నుంచి బర్మింగ్‌హామ్ వరకు ఎదిగిన ఆకాశ్ విజయం వెనుక ఎన్నో కష్టాలు, ఒడిదుడుకులు, సవాళు ల్నాయి.బిహార్‌లోని రోహ్‌తాస్ జిల్లా దెహ్రి గ్రామంలో జన్మించిన ఆకాశ్ కుటుంబానికి క్రీడా నేపథ్యం లేదు. వాస్తవానికి ఈ రాష్ట్రంలో క్రికెట్‌కు పెద్దగా ఆదరణ కనిపించదు. ఇక బ్యాట్, బంతి పడితే భవిష్యత్ ఉండదని టీచర్‌గా పనిచేసిన ఆకాశ్ తండ్రి కూడా అతడిని ప్రోత్సహించలేదు. కొడుకు బాగా చదువుకుని ఉద్యోగం చేస్తే చాలనుకున్నాడు. ఆ గ్రామంలో బాలురు క్రికెట్ ఆడితే పెద్ద తప్పుగా పరిగణిస్తుంటారు. మిగతా తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఆకాశ్‌తో కలవనిచ్చేవారు కాదట. అతడు క్రికెట్ ఆడడం తప్ప ఏమీ చేయడని, మీ చదువులు కూడా పాడవుతాయని హెచ్చరించేవారు. అందుకే ఆకాశ్ ఎవరికంటా పడకుండా క్రికెట్ ఆడాల్సి వచ్చేది. బిహార్‌లో ఉంటే ఎదగలేమనుకున్న ఆకాశ్ బెంగాల్‌లోని దుర్గాపూర్‌కు మకాం మార్చాడు. అప్పటిదాకా బ్యాటర్‌గా ఉన్న అతను పేసర్‌గా శిక్షణ తీసుకుంటూ స్థానిక క్లబ్‌లకు ఆడాడు. కెరీర్ గాడిలో పడుతున్న దశలో ఆకాశ్ జీవితంలో ఊహించని విషాదాలు చోటు చేసుకున్నాయి. ఆరు నెలల వ్యవధిలోనే ఆకాశ్ తండ్రి, సోదరుడు అనారోగ్యంతో మరణించారు. దాంతో కుటుంబ బాధ్యతల కోసం అతను స్వస్థలానికి తిరిగిరాక తప్పలేదు. క్రికెట్‌వైపు మనసు లాగుతున్నా, కుటుంబ పరిస్థితుల రీత్యా అతను మూడేళ్లు ఆటకు దూరం కావాల్సి వచ్చింది. ఈ దశలో ఆకాశ్ పడిన వేదన అంతాఇంతా కాదు. ఎట్టకేలకు సుదీర్ఘకాలం తర్వాత కోల్‌కతా వెళ్లి అరుణ్ లాల్ శిక్షణలో రాటుదేలి బెంగాల్ జట్టులో చేరాడు.

# సిరీస్ ఆసీస్ వశం



సెయింట్ జార్జ్ (గ్రెనడా): వెస్టిండీస్‌తో రెండో టెస్టులో ఆస్ట్రేలియా 133 పరుగులతో గెలిచింది. దీంతో 3 టెస్టుల సిరీస్‌ను ఆసీస్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2–0తో సొంతం చేసుకొంది. ఆసీస్ నిర్దేశించిన 277 పరుగుల ఛేదనలో విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 143 రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ రోస్టన్ చేజ్ (34) టాప్ స్కోరర్. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 243 పరుగులకు ఆలౌటైంది. స్మిత్ (71), గ్రీన్ (52) రాణించారు. షమర్ జోసెఫ్ 4 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 286, విండీస్ 253 రన్స్ చేశాయి.

# నా గురించి ఆందోళన వద్దు..



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో ఆకాశ్ దీప్ పది వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. తన ప్రదర్శనను.. కేన్సర్‌తో బాధపడుతున్న సోదరికి అంకితం ఇస్తున్నట్టు మ్యాచ్ అనంతరం ఆకాశ్ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందుకు అతడి సోదరి జ్యోతి స్పందిస్తూ.. 'నా సోదరుడి ప్రదర్శనకు గర్విస్తున్నా. ఇంగ్లండ్ టూర్‌కు వెళ్లే ముందు ఆకాశ్‌ను ఎయిర్‌పోర్టులో కలిశా. నా ఆరోగ్యం గురించి ఆందోళన చెందవద్దని, దేశం కోసం ఆడాలని సూచించా. ప్రస్తుతం నాకు కేన్సర్ మూడో దశలో ఉంది. మరో ఆరు నెలలు చికిత్స తీసుకున్నాక పరిస్థితి ఏమిటనేది చెబుతామని డాక్టర్లు తెలిపారు' అని వివరించింది. అయితే తనకు కేన్సర్ ఉందంటూ ఆకాశ్ వెల్లడించిన విషయం తనకు తెలియదని ఆమె పేర్కొంది.

# జొకో 16వ సారి..



లండన్: ఏడుసార్లు చాంపియన్ నొవాక్ జొకోవిచ్ వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో ఆరో సీడ్ జొకోవిచ్ 1–6, 6–4, 6–4, 6–4తో 11వ సీడ్ అలెక్స్ డిమినార్‌పై గెలిచాడు. ఈ వేదికపై జొకో క్వార్టర్స్ చేరడం ఇది 16వసారి. మరో ప్రీక్వార్టర్‌ఫైనల్లో 22వ సీడ్ కొబోలీ 6–4, 6–4, 6–7 (7), 7–6 (2)తో సిలిచ్‌కు చెక్ పెట్టాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో డిఫెండింగ్ చాంప్ అల్కారజ్ 6–7 (7), 6–3, 6–4, 6–4తో 14వ సీడ్ రుబ్లేవ్‌పై పోరాడి గెలిచాడు. మరో మ్యాచ్‌లో నోరీ 6–3, 7–6 (4), 6–7 (9), 6–7 (7), 6–3తో జారీని చిత్తు చేశాడు. మహిళల సింగిల్స్‌లో అన్‌సీడెడ్ బెలిండా బెన్సిక్ 7–6 (4), 6–4తో 18వ సీడ్ అలెగ్జాండ్రోవాకు షాకిచ్చి క్వార్టర్స్‌కు చేరింది. ఇతర రౌండ్–16 మ్యాచ్‌ల్లో 13వ సీడ్ అనిసిమోవా 6–2, 5–7, 6–4తో 30వ సీడ్ ఎన్‌సోకోవాపై, 19వ సీడ్ సంసనోవా 7–5, 7–5తో బౌజాసపై విజయంతో ముందంజ వేశారు.ప్రీక్వార్టర్స్‌లో భాంబ్రీ జోడీ ఓటమి: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యుకీ భాంబ్రీ/రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ జోరుకు ప్రీక్వార్టర్స్‌లో బ్రేక్ పడింది.

# ఆసియా వెయిట్ లిఫ్టింగ్‌లో భవానికి పసిడి

: ఆసియా యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ యువ లిఫ్టర్ రెడ్డి భవాని స్వర్ణ పతకం కొల్లగొట్టింది. కజకిస్థాన్‌లోని ఆస్తానాలో జరుగుతున్న ఈ పోటీల్లో 48 కిలోల విభాగంలో భవాని మొత్తంగా 159 కిలోల బరువెత్తి విజేతగా నిలిచింది. క్లీన్ అండ్ జెర్క్‌లో 90 కిలోలు, స్నాచ్‌లో 69 కిలోల బరువెత్తి వీటిలో కూడా వ్యక్తిగత స్వర్ణాలు సాధించింది. విజయనగరం జిల్లాలోని కొండకరకం గ్రామం భవాని స్వస్థలం.



# టుడే బిజినెస్

## మొబైల్ వినియోగదారులకు అలర్ట్.. పెరగనున్న రీఛార్జ్ ప్లాన్స్ ధరలు..




ఇప్పటికే మొబైల్ రీఛార్జ్ ప్లాన్ల ధరలు ఎక్కువగా ఉన్నాయని బాధపడుతున్నారా? అయితే మీకు మరింత బ్యాడ్ న్యూస్. ఈ ఏడాది డిసెంబర్ నాటికి జియో , ఎయిర్‌టెల్ మొబైల్ రీఛార్జ్ ప్లాన్ల ధరలు 10 నుంచి 12 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ జెఫ్రీస్ అంచనా వేసింది. 2024 జులైలో టెలికాం సంస్థలు మొబైల్ రీఛార్జ్ ప్లాన్ల ధరలను పెంచాయి. ఏడాదిగా అవే ప్లాన్లు కొనసాగుతున్నాయి. మరో ఆరు నెలలో 5జీ నెట్‌వర్క్‌కు అనువుగా ధరల పెంపు ఉండొచ్చని జెఫ్రీస్ అంచనా వేస్తోంది.మొబైల్ కనెక్షన్ల సంఖ్య ఈ ఏడాది మే నెల నాటికి 108 కోట్లకు చేరింది. గత 29 నెలల్లో ఇదే గరిష్ట స్థాయి. ఈ కనెక్షన్లలో రిలయన్స్ జియో మార్కెట్ వాటా 53 శాతం కాగా, ఎయిర్‌టెల్ మార్కెట్ షేర్ 36 శాతం. మే నెలలో రిలయన్స్ జియోకు 55 లక్షల మంది వినియోగదారులు అదనంగా పెరిగారు. అలాగే ఎయిర్‌టెల్‌కు 13 లక్షల మంది చందాదారులు జత కలిశారు. ఈ మేరకు వోడాఫోన్ ఐడియా నుంచి వినియోగదారులు భారీగా ఈ రెండు టెలికాం నెట్‌వర్క్‌లకు మారిపోయారు.జియో, ఎయిర్‌టెల్ సంస్థలకు అదనంగా వినియోగదారులు పెరుగుతున్నందున ధరలు పెంచేందుకు ఇదే అనువైన సమయమని జెఫ్రీస్ అంచనా వేసింది. దీంతో ప్రస్తుతం ఉన్న ప్లాన్‌తో పోల్చుకుంటే 10 నుంచి 12 శాతం మేర ధరలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. వేగం, డేటా వినియోగం, సమయం ఆధారంగా ధరలను పెంచుతారని అంచనా వేస్తోంది.

## మరింత తగ్గిన బంగారం ధరలు..

### ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




ఇటీవలి కాలంలో ఆల్‌టైమ్ గరిష్టానికి చేరిన బంగారం , వెండి ధరలు ప్రస్తుతం దిగి వస్తున్నాయి. గత వారం లక్ష రూపాయలను దాటేసిన బంగారం ప్రస్తుతం 98 వేలకు దిగి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జులై 8న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 98, 280కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 90, 100కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే 24 క్యారెట్ల బంగారం ధరం రూ.600 మేర, 22 క్యారెట్ల బంగారం ధర రూ.500 మేర తగ్గింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 98, 430కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 90, 240కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 98, 280కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 90, 100కి చేరింది. వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

## ఫ్లాట్‌గా ట్రేడ్ అవుతున్న దేశీయ సూచీలు.. ఈ రోజు టాప్ స్టాక్స్ ఇవే..




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పన్నుల పెంపు పేరు చెప్పి బెదిరిస్తుండడంతో అంతర్జాతీయ మార్కెట్లు అప్రమత్తంగా కదలాడుతున్నాయి. ఈ రోజు ఆసియా మార్కెట్లన్నీ ఊగిసలాట ధోరణిలోనే కదులుతున్నాయి. అదే రీతిలో భారత స్టాక్ మార్కెట్లు కూడా ఫ్లాట్‌గా ట్రేడ్ అవుతున్నాయి. లాభనష్టాలతో దోబూచులాడుతున్నాయి. బ్యాంకింగ్ రంగం మాత్రమే లాభాలతో ఉంది. ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాల్లో ఊగిసలాడుతున్నాయి.సోమవారం ముగింపు (83, 442)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభనష్టాలతో దోబూచులాడుతోంది. ప్రస్తుతం ఉదయం 10:30 గంటల సమయంలో సెన్సెక్స్ 2 పాయింట్ల స్వల్ప పాయింట్ల నష్టంతో 83, 440 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 9 పాయింట్ల స్వల్ప నష్టంతో 25, 451 వద్ద కొనసాగుతోంది. ట్రంప్ పోకడలతో సోమవారం అమెరికా మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ట్రంప్ కొత్తగా 14 దేశాలపై సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు.సెన్సెక్స్‌లో కోటక్ మహీంద్రా, ఎన్‌హెచ్‌పీసీ, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎమ్‌సీ, ఎన్ఫోఎడ్జ్, ఎటర్నల్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. టైటాన్ కంపెనీ, బీఎస్ఈ లిమిటెడ్, 306 వన్, ఏంజెల్ వన్, సిప్లా షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 284 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 246 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.70గా ఉంది.

## ఆద్యంతం ఊగిసలాటలే... సూచీలు అక్కడక్కడే..



ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం పరిమిత శ్రేణిలోనే కదలాడినప్పటికీ, ఆద్యంతం లాభనష్టాల మధ్య ఊగిసలాటలకు లోనయ్యాయి. సెన్సెక్స్ చివరికి 9.61 పాయింట్ల అతి స్వల్ప లాభంతో 83,442.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఏమార్పు లేకుండా 25,461.30 వద్ద ముగిసింది. భారత ఎగుమతులపై అమెరికా ప్రకటించిన అదనపు సుంకాలు ఈ నెల 9 నుంచి అమలులోకి రానున్నాయి. పైగా, అమెరికా-భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాకపోవడంతో మార్కెట్ మదుపరులు కొత్త పెట్టుబడుల విషయంలో వేచి చూసే ధోరణిని కనబరిచారు. ఆసియా మార్కెట్లో బలహీన ట్రెండ్, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు మళ్లీ తరలిపోతుండటం వంటి అంశాలూ మన సూచీలపై ఒత్తిడి పెంచాయని ఈక్విటీ విశ్లేషకులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 12 మాత్రమే రాణించాయి.

## జీఎంఆర్ ఏరో టెక్నిక్‌తో ఆకాశ ఎయిర్ ఒప్పందం




జీఎంఆర్ ఏరో టెక్నిక్‌తో ఆకాశ ఎయిర్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఆకాశ ఎయిర్‌కు చెందిన బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు బేస్ మెయింటెనెన్స్ సేవలను అందించనున్నట్లు మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాలింగ్ (ఎంఆర్‌ఓ) సేవల సంస్థ జీఎంఆర్ ఏరో టెక్నిక్ వెల్లడించింది. మూడేళ్ల పాటు ఈ సేవలందించేందుకు గాను ఆకాశ ఎయిర్‌తో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసినట్లు జీఎంఆర్ ఏరో టెక్నిక్ తెలిపింది. హైదరాబాద్‌లోని జీఎంఆర్ ఏరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్క్‌లో ఉన్న తమ అత్యాధునిక ఎంఆర్‌ఓ కేంద్రంలో ఈ సేవలను అందించనున్నట్టు జీఎంఆర్ తెలిపింది. దేశంలోని ప్రముఖ విమానయాన సంస్థలకు విశ్వసనీయ భాగస్వామిగా పెరుగుతున్న తమ స్థానానికి ఇది దర్పణమని జీఎంఆర్ ఏరోటెక్నిక్ ప్రెసిడెంట్ అశోక్ గోపీనాథ్ అన్నారు. తమ సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణా సామర్థ్యం, కస్టమర్ ప్రధాన వైఖరికి ఇది ఒక పరీక్ష అని పేర్కొన్నారు. విమానాల భద్రత, విశ్వసనీయతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తామని, జీఎంఆర్ ఏరోటెక్నిక్‌తో తమ భాగస్వామ్యం దీన్ని మరింత సుస్థిరం చేస్తుందని ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీస్ బెల్సన్ కోటిన్హో అన్నారు. 2022లో ప్రారంభమైన ఆకాశ ఎయిర్ ప్రస్తుతం 23 దేశీయ, 5 అంతర్జాతీయ గమ్యాలకు సర్వీసులు నడుపుతోంది. లీప్-1బీ ఇంజన్లతో కూడిన 226 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు ఆర్డర్లు జారీ చేసింది.

## వింటేజ్ కాఫీ రూ.215 కోట్ల సమీకరణ




ప్రిఫరెన్షియల్ పద్ధతిలో ఈక్విటీ షేర్లు, కన్వర్టబుల్ వారంట్ల జారీ ద్వారా రూ.215.76 కోట్ల సమీకరణకు బోర్డు సభ్యుల నుంచి ఆమోదం లభించిందని హైదరాబాద్‌కు చెందిన వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్ లిమిటెడ్ (వీసీబీఎల్) సోమవారం వెల్లడించింది. అయితే, ఈ ఇష్యూకు షేర్‌హోల్డర్లతో పాటు ఇతర అనుమతులు ఇంకా రావాల్సి ఉందని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఇష్యూ ద్వారా సమీకరించనున్న నిధులను 5,000 ఎంటీపీఏ సామర్థ్యంతో ఫ్రీజ్ డ్రైడ్ కాఫీ ప్లాంట్ ఏర్పాటుకు ఉపయోగించనున్నట్లు తెలిపింది. అంతేకాకుండా ప్రీమియం కాఫీ విభాగంలో మెరుగైన మార్కెట్ వాటాను దక్కించుకునేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొంది. కాగా, కంపెనీకి చెందిన స్ప్రే డ్రైడ్ అండ్ అగ్లోమెరాటెడ్ కాఫీ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతమున్న 6,500 ఎంటీపీఏ నుంచి 2026 మార్చి చివరికల్లా 11,000 ఎంటీపీఏకు పెరగవచ్చని వీసీబీఎల్ అంచనా వేస్తోంది.

## క్యాప్‌జెమినీ గూటికి డబ్ల్యూఎన్ఎస్

Capgemini

స్తున్నట్లు ఫ్రాన్స్‌కు చెందిన ఐటీ కంపెనీ క్యాప్‌జెమినీ సోమవారం ప్రకటించింది. ఇందుకు ఇరు కంపెనీల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ ఒప్పందం పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. డబ్ల్యూఎన్ఎస్‌కు చెందిన ఒక్కో షేరుకు క్యాప్‌జెమినీ 76.50 డాలర్లు చెల్లించనుంది. డబ్ల్యూఎన్ఎస్ షేరు గత 90 రోజుల సగటు ట్రేడింగ్ ధరతో పోలిస్తే 28 శాతం అధికమిది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత వ్యాపార కార్యకలాపాల్లో క్యాప్‌జెమినీ అగ్రగామిగా ఎదిగేందుకు ఈ డీల్ దోహదపడనుంది. ఎందుకంటే, డబ్ల్యూఎన్ఎస్ ఏజెంటిక్ ఏఐ, అటానమస్ ఏఐ ఏజెంట్ల ద్వారా బీపీఎస్ సేవలందిస్తోంది. మార్కెట్లో ఏజెంట్ ఏఐ, అటానమస్ ఏఐ ఏజెంట్ల సేవలకు గిరాకీ శరవేగంగా పెరుగుతోంది. కాగా, అంతర్జాతీయంగా కార్యకలాపాలు సాగిస్తున్న క్యాప్‌జెమినీ.. హైదరాబాద్ సహా భారత్‌లోని పలు నగరాల్లో కార్యాలయాలను కలిగి ఉంది. డబ్ల్యూఎన్ఎస్ విషయానికొస్తే, చెన్నైకి చెందిన కేశవ్ ఆర్ మురుగేశ్ లండన్ కేంద్రంగా 1990లో ఈ కంపెనీని ప్రారంభించారు. డబ్ల్యూఎన్ఎస్‌కు భారత్ రెండో కేంద్రంగా ఉంది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006